# కొత్తనీరు • మధురాంతకం రాజారాం

“హలో, అత్తయ్యా! నమస్కారం!” కూడికలతో, తీసివేతలతో సతమతమవుతూ అకౌంట్సు చూసుకుంటున్న మీరాబాయి ఉలిక్కిపడి తల పైకెత్తింది. మందస్మితాన్ని వెదజల్లుకుంటూ ఆగంతకుడు లోపలికొచ్చేస్తున్నాడు.

“ఓరి, నువ్వట్రా పాండురంగం! ఫరవా లేదే! నీకీవైపుకూడా గాలి మళ్ళిందే! వేలు విడిచిన మేనత్త ఒకతె వుందని గుర్తుకొచ్చిందన్న మాట! పోనీలే! కూచో, కూచో! అమ్మా, నాన్నా బావున్నారా? మీ పంట పొలాలు, ఫల వృక్షాలు, పాడి పశువులు అన్నీ క్షేమమే గదా?”

మీ ఆలమందలు కుశలమేనా అని రారాజు దుర్యోధనుడు శ్రీకృష్ణుణ్ని పరామర్శించడం జ్ఞప్తికొచ్చింది పాండురంగానికి. పాజిటివ్‌గా సమాధానాలు చెబితే ఆమెకు సంతోషం కలగదని అతడికి స్పష్టంగా తెలుసు. తానొక్కతె తప్పితే, మిగిలిన లోకులందరూ ఏవో యిబ్బందులకు గురవుతూ వుంటేనే ఆమె కానందం. అందుకని తన ప్రత్యుత్తరాన్ని ఆమె ఆంతర్యానికి అనుగుణ్యంగానే అతడు మలుచుకున్నాడు.

“ఏం చెప్పమంటావత్తయ్యా! రెండు మూడేళ్ళుగా సజావుగా వానల్లేవు గదా! పంటలు సరిగ్గా చేతికందడం లేదు. మామిడి, కొబ్బరితోపుల్లో కాపు తగ్గిపోయింది. పచ్చగడ్డి లేక జెర్సీ గొడ్లు కూడా అంతంత మాత్రంగానే పాలిస్తున్నాయి. ఈ ఏడాది అయినా ఋతుపవనాలు కరుణిస్తాయో, లేదో తెలియడం లేదు. ఉత్తర కార్తెలో అయినా చినుకులు పడతాయేమోనని కళ్ళల్లో ఒత్తులేసుకుని ఆకాశం వైపు చూస్తున్నాం...”

మీరాబాయి ముఖం బంతి పువ్వులా విప్పారిపోయింది.

“అయ్యో, పాపం! మీరు చాలా కష్టాల్లో వున్నారే!” అంటూ సానుతాపం ప్రకటించి “ఎండలో పడి వచ్చావు. మజ్జిగ పుచ్చుకుంటావా? కాఫీ చేయించి తెమ్మంటావా?” అని అడిగింది.

“అబ్బే! కాఫీ ఎందుకు? మజ్జిగ చాలు. ఎట్లాగూ పల్లెటూరి వాళ్ళం గదా!” అన్నాడు పాండురంగం.

“ఏమే నరసమ్మా! గ్లాసు నిండుకూ నీరు మజ్జిగ...” అంటూ కేకేసింది మీరాబాయి.

నరసమ్మ తీసుకొచ్చిన మజ్జిగ గ్లాసును ఖాళీచేసి, “హబ్బ! హాయిగా వుంది. ఎడారిలో మంచి ఒయాసిస్సులోకి వచ్చినట్టుందనుకో అత్తయ్యా!” అంటూ సోఫాలో సేదదీరాడు పాండురంగం.

“నిజంగా? వేళాకోళానికి కాదు గదా?” అంటూ సంశయం వెలిబుచ్చింది మీరాబాయి.

“నీ మీద ఒట్టే!” ప్రాతిపదిక సరిగ్గానే కుదిరిందన్న సంతృప్తితో, పొగడ్తల గుర్రానికి కళ్ళెం మరి కొంచెం సడలు చేసి వదలి పెట్టాడు పాండురంగం. “చల్లటి మేడ. దీనికి గొడుగు పట్టినట్టుగా చుట్టూరా చెట్లు. ఇంటిపనుల్లు, వంట పన్లు చేసిపెట్టడానికి పని మనిషి, అమెరికాలో ఉద్యోగం చేస్తున్న కొడుకు. బ్యాంకులో డబ్బు, ఎంతటివారికి దొరికే దత్తయ్యా యింత అదృష్టం! లోకమంతా నిన్ను చూసి అసూయ పడుతోందంటే, అందులో ఆశ్చర్యమేముంది చెప్పు?”

“అసూయ! చప్పగా అదేం మాటరా అబ్బీ! కళ్ళల్లో కారం పోసుకుంటూ వుందని చెప్పు, ఒప్పుకుంటాను. చాలని దానికి ఈ కాన్వెంటొకటి పెట్టానా? ఇక చూసుకోరా నాన్నా, మనసొప్పక చస్తున్నారనుకో...”

“బోర్డు చూశానులే అత్తయ్యా! బృందావన్ కాన్వెంట్ అని పేరు కూడా సొందికగానే పెట్టావు. బృందావనంలో మీరాబాయి! ఆహా ఏమి అందం, ఏమి చందం” తన్మయత్వాన్ని అనుభవిస్తూ అన్నాడు పాండురంగం.

“ఎందుకులే ఆ మాట! మేడ, తోట, డబ్బు, దస్కం ఇవేవీ నాకు పేరు తెచ్చి పెట్టలేదురా పాండూ! టౌన్లో ఎక్కడికి వెళ్ళినా బృందావన్ కాన్వెంటు మీరాబాయి గారనే నాకు కితాబు...”

“కాన్వెంటు కంత మంచి పేరొచ్చేసిందా అత్తయ్యా!”

“నావల్లనే దానికి పేరు! నేను స్ట్రిక్టుగా వుంటాను. రూలంటే రూలే! పిల్లలందరూ యూనిఫారంలోనే రావాలి. పిల్లలతోపాటు స్టాఫ్ మెంబర్లు కూడా తొమ్మిదింటికల్లా కాంపౌండులో అడుగు పెట్టాలి. ఎట్టి పరిస్థితిలోనూ లేటుగా రాగూడదు. ప్రతి నెలా అయిదో తేదీ లోపల ఫీజు చెల్లించాలి. చెల్లించకపోతే పేరు తీసేసి యింటికి వెళ్ళమంటాను. పిల్లల ప్రోగ్రెస్ తృప్తికరంగా లేకపోతే టీచర్ల దగ్గర సంజాయిషీ రాయించుకుంటాను. చీటికి మాటికి సెలవులివ్వను. ప్రతి రోజూ కనీసం రెండు సార్లయినా రౌండ్సుకి వెళ్తాను. అప్పుడప్పుడు క్లాస్ రూంలో ప్రవేశించి, వెనుక బెంచీపైన కూచుని, టీచర్లు ఎలా పాఠాలు చెబుతున్నారో అబ్జర్వ్ చేస్తాను”

“అంతెందుకూ? ధర్మాన్ని నాలుగు పాదాలతో నడిపిస్తున్నావని చెప్పరాదా అత్తయ్యా! ఎంతో కొంత ఫీజు వసూలు చేస్తున్నావన్న మాటకేంగానీ, నువ్వు చేస్తున్న సంఘ సేవకు మెచ్చి నీకు పద్మశ్రీ యిచ్చినా యివ్వొచ్చు.”

“ఎలాగైనా బుద్ధిమంతుడివి. నువ్వయితే నా శ్రమను గుర్తించావు. నిజానికి నేను వసూలు చేస్తున్న ఫీజెంత? ఎల్.కె.జి.కి పదిహేను. యు.కె.జి.కి ఇరవై. ఆపైన ఒకటి నుంచి అయిదు తరగతుల దాకా స్టూడెంటుకి పాతిక రూపాయిలు మాత్రం...”

“అదేమీ పెద్ద మొత్తం కాదే! నీకు బోలెడన్ని మెయింటెనెన్సు ఖర్చులుంటాయి గదా...”

ఈ రోజు ఉదయం ఎవరి ముఖం చూసి లేచానా అన్న విచికిత్సలో పడిపోయింది మీరాబాయి. కాకపోతే యింత యింగితంగా తన చర్యలన్నింటిని సమర్థించే బంధుసత్తముడొకడు హఠాత్తుగా వూడిపడే వాడేనా? వాడికొక పూట సుష్టుగా తిండి పెట్టినా పెట్టొచ్చు...”

“ఒరేయ్ పాండూ! ఆ పనీ, ఈ పనీ వుందని నన్ను మభ్యపెట్టాలని చూడకు. మవ్వీ పూట భోజనం చేసే వెళ్ళాలి...”

“ఇలా మొగమాట పెట్టేస్తే ఎలాగత్తయ్యా!” గింజుకున్నాడు పాండురంగం” చాలా రోజులయింది గదా అని నిన్నొకసారి చూసి పోదామని వచ్చాను. భోజనానికేముంది?”


“కాదులేరా పాండూ! నీతో కాసేపు మాట్లాడవలసిన అగత్యం కూడా వుండిపోయింది నాకు! అదే మా సారథి పెళ్ళి గురించి...”

"సారధి పెళ్ళికేముంది? మీరాబాయిగారికి ఏకైక పుత్రుడుగావడంలోనే వాడిది బంగారు భవిష్యత్తని తేలిపోయింది. పైగా ఇంజనీరు. ఆ ఉద్యోగం గూడా ఎక్కడ? స్టేట్స్‌లో. వాడికేం తక్కువ? సారధికి పిల్లనివ్వడానికి కోటీశ్వరులు క్యూలో నిల్చోరా అత్తయ్యా?"

"అదేరా నాయనా, వచ్చిన చిక్కు! సెలక్షన్ కుదరడం లేదే! ఇప్పటికి మూడేళ్ళ నుంచి ప్రయత్నం. రంగాపురం రాజయ్యతో మొదలైంది. అతడు డబ్బుగా యాభై వేలు, బంగారంగా పాతిక తులాలు యిస్తానన్నాడు. అమ్మాయిని చూచొద్దామనుకుంటూ వుండగా, ఆత్మకూరు నుంచి యింకొక ఆసామి రెక్కలు గట్టుకుని వచ్చేశారు. ఆయన రాజయ్య కంటే రెట్టింపు యిస్తానన్నాడు. అమ్మాయి ఫోటోను కూడా చూపించాడు. ఫోటోను అమెరికాకు పోస్టు చేద్దామనుకుంటూ వుండగా, హైదరాబాదు నుంచి ఒక సంబంధం వచ్చింది. ఒక రెండస్తుల మేడ, లక్ష రూపాయిలు ముట్టజెప్పి యాభై తులాల దాకా బంగారం పెడతామంటూ వాళ్ళూ బరిలో కూచున్నారు. ఇంతలో ఇంకొక వర్తమానం తెలిసింది. రాయలపేట వీరభద్రయ్యగారని వినే వుంటావు. వాళ్ళది జమిందారీ ఫామిలీ అని, ఆస్తి యాభై లక్షల దాకా వుంటుందనీ, సంతానం ఇద్దరే కూతుళ్ళు గనుక బేర సారాలు లేకుండా పాతిక లక్షలు కలిసొచ్చినట్టేనని అన్నారు. ఇదైతే బాగుంటుందని అక్కడికొక పెద్దమనిషిని పంపించాను..."

"ఏమన్నాడు?" పాండురంగం గొంతుకలో ఆతురత ధ్వనించింది.






"అతగాడు బాగా తల బిరుసు మనిషల్లే వున్నాడు. వెళ్ళిన పెద్దమనిషికి కాఫీ అయినా యిప్పించకుండా, ఈ ప్రపోజల్ కుదిరేదిగాదు. వెళ్ళిరండి!" అనేశాడట దాంతో నాకు తిక్కరేగింది. అంతకంటే మంచి సంబంధం కుదుర్చుకోకపోతే నా పేరు మీరాబాయే కాదనుకున్నాను."

"అంతగాక! సారథిలాంటి వాడికి పాతిక లక్షలేం పెద్ద మొత్తమా! వాడి రేటు అర్ధ కోటి దాకా ప్రాకినా ఆశ్చర్యం లేదు. లేదంటే కొంచెం ఆలస్యం గావచ్చు. ఫరవాలేదు. నాకు తెలిసి ముప్ఫైయ్యేళ్ళు దాటిన తర్వాత కూడా పెళ్ళి చేసుకున్నవాళ్ళు వున్నారు."

తన స్వాతిశయానికి పాండురంగం పెట్టిన గిలిగింతల వలన గలిగిన సంతోష పారవశ్యంలో మీరాబాయి మైమరచిపోయింది.

"ఏమిటో అనుకున్నానుగానీ, భలే తెలివి తేటలున్నాయిరా నీకు! నా మనసులోని మాటే చెప్పేస్తున్నావు..." అంటూ ఆమె అతిథిని అభినందించి, "ఒకసారి కాన్వెంటు చూసొద్దువుగానీ, లేచి వెళ్ళి ముఖం కడుక్కో" అంటూ పురమాయించింది.

** ** **

కరస్పాండెంటు మీరాబాయి నీడలో ఒదిగి ఒదిగి నడుస్తూ, ముందుకు చూచాడు పాండురంగం. ప్రహరీ గోడకు సమాంతరంగా రెండు వరుసలుగా వేసిన పాకలే కాన్వెంటు. గచ్చు చేయబడిన నేలపైన చిన్న బెంచీల్లో పొట్టి బుడమ కాయల్లాంటి పిల్లలు కూచున్నారు. మీరాబాయి కనిపించగానే ఆ పిల్లలు లేచి నిల్చున్న తీరు, పిల్లలూ, పంతులమ్మలూ గూడా "నమస్తే మేడం" అంటూ చేతులు జోడించిన పద్ధతీ, పంతులమ్మల ముఖాల్లో కానవచ్చిన కలవరం, వీటిని బట్టి మీరాబాయి ఏలుబడి ఎలా సాగుతూ వుందో ఊహించుకోగలిగాడు పాండురంగం.

అత్తింటి కోడళ్ళలా అణిగి మణిగి వుండడానికి, భయ భక్తుల భారంతో క్రుంగిపోవడానికి ఆ పంతులమ్మలు బాగా అలవాటు పడిపోయినట్టున్నారు. అయితే అదంతా వట్టి అతి వినయమనే నిరూపించడానికి మీరాబాయి నానా విధాలుగా ప్రయత్నించింది.

యు.కె.జి. పాక దగ్గర నుంచి విచారణ ప్రారంభమైంది.

"ఏమమ్మా శకుంతలా! మునిసిపల్ కౌన్సిలర్ పరశురాం తెలుసా నీకు? తెలిసుండదు. అతగాడు నన్ను నడిరోడ్డులో నిలబెట్టి దులిపి పారేశాడని తెలుసా? అబ్బే, అది మాత్రం ఎలా తెలిసుంటుంది? యు.కె.జి.లో కొచ్చినా అంబరిల్లా, ఇంక్ బాటిల్ లాంటి పదాలు రాయడం గూడా రాదటగా! నన్నా పేరెంటు దులిపేశాడమ్మా తల్లీ! నీకేం, బెల్లం కొట్టిన గుండ్రాయిలా



పలకవు, పలకవు. ప్రతి నెలా మొదటి తేదీ పెట్టగానే మీకు జీతాలిస్తున్నందుకటమ్మా నాకీ దండన?"

శకుంతలా మేడం కళ్ళల్లో విలిచివ కన్నీళ్ళు మాత్రమే మీరాబాయికి జవాబు. ఆ ప్రతిస్పందనను లెక్కచెయ్యకుండా ముందుకు సాగుతూ మెల్లగా పాండు రంగం చెవిలో ఊదింది మీరాబాయి.

"మాటకు ముందే కన్నీళ్ళు పెట్టేవాళ్ళని నమ్మ గూడదురా పాండూ!"

"నమస్కార బాణం ఒకటిపారేస్తేసరిపోయిందా?" రెండో తరగతి పంతులమ్మపైకి ఎగబడింది మీరా బాయి. "నువ్వు చెప్పే పాఠం ఫ్రంట్ బెంచీలో వాళ్ళకైనా వినిపించేటట్టు లేదే? ఎన్ని రోజులైందమ్మా అన్నం తిని?"

పంతులమ్మల్లో ఒక్కొక్కరినీ ఒక్కొక్కవిధంగా సన్మానించిన మీదట, ఓ చెట్టు నీడలో నిల్చుని పాండురంగం దగ్గర తన బాధను కాస్త వెళ్ళబోసుకుంది మీరాబాయి.

"చూచావట్రా పాండూ! ఇదీ వరస. ఈ పిల్లులు పాలు తాగవేమోనని అనుకోవద్దు. వీళ్ళకు గొంతుకల దాకా నాపైన అక్కసు వుంది. అమ్మో, చూడ్డాని కిలావున్నారుగానీ, ఈ మాత్రం డబ్బులు యింకెక్కడైనా దొరికేటట్టుంటే, వీళ్ళు నా ముఖమైనా చూడరు. అయినా నేనేం ఖాతరు చెయ్యన్లే! రోజుకొకసారి యిలా దండకం వల్లిస్తుంటాను. ఆమాత్రం లేకపోతే యింకేమైనా వుందా, ఉఫ్‌న వూదిపారెయ్యరూ!"

"అవునవును. జీతాలిస్తున్నావు గదా! ఊరికే తేరకు చేస్తున్నారా ఏమిటి?"

"కాదామరి! ప్రతి టీచరుకూ రెండు వందలా యాభై యిస్తున్నాను. హెడ్ మిస్ట్రెస్‌కైతే బోడి హెడ్ మిస్ట్రెస్, పేరుకు మాత్రమేలే మూడొందలిస్తున్నాను..."

'రౌండ్' ముగించి యింటి వైపు దారితీసింది మీరా బాయి. ఆమె వెంట నడుస్తూ కాస్త మనోగణితంలో పడ్డాడు పాండురంగం. క్లాసుకు ముప్పైమంది చొప్పున ఏడు క్లాసులు, స్టూడెంటుకు సగటున ఇరవై రూపాయిలే ననుకున్నా, కాన్వెంటు పైన వచ్చే ఆదాయం, ఆ మొత్తంలో టీచర్లకు ముడుతున్న శాతం. ఈ జమా ఖర్చుల లెక్క యింకా తేలనే లేదు. మూడో తరగతి పాకలో వున్న బుల్లి పంతులమ్మ ఏదో అదృశ్య శక్తి వెనుక నుంచి ముందుకు నెడుతున్నట్టుగా మీరాబాయి ఎదుటి కొచ్చేసింది.

"మేడం...ప్లీజ్! ఒక రిక్వెస్టండీ!"

"ఏమమ్మా! తల నొప్పిగా వుందా? కళ్ళు తిరుగుతున్నాయా? జబ్బు లక్షణాలేమీ లేవే? పని ఎగ్గొట్టాలని బుద్ధిపుట్టి వుంటుంది. అంతే గదూ!"

టీచరు ముఖంలో నెత్తురు చుక్క లేదు. అవసరం అలాంటిదేమో! దీనంగా బతిమాలుకోసాగింది. "అబ్బే, కాదండీ! సాయంకాలం...లాస్ట్ పీరియడ్... పర్మిషన్ యిప్పిస్తే చాలు..."

"ఓయబ్బో! సాయంకాలం సంగతా! చూద్దాంలే!" ఆ అమ్మాయికింకొక మాట మాట్లాడే అవకాశమివ్వకుండా విసవిసా సాగిపోతోంది మీరాబాయి.

క్లాస్ రూం వైపు తిరిగి వెళుతున్న ఆ టీచరు వైపు చూస్తూ, అక్కడే నిల్చుండిపోయాడు పాండురంగం.

అడుగుల చప్పుడు వినిపించకపోవడంతో మీరా బాయి తటాలున వెనుదిరిగింది.

"ఏమిట్రా పాండూ! ఏం చూస్తున్నావు?"

"కాదత్తయ్యా! ఇంత చిన్న వయసులోనే ఈ అమ్మాయి ఉద్యోగం చెయ్యవలసి వచ్చిందంటే..."

"ఓహో, ఆ పిల్ల కథ నేను చెబుతాన్లే రా!"

చరచరా వచ్చేశాడు పాండురంగం. మీరాబాయి కొనసాగించింది.

"తండ్రి శిరస్తాదారు. రిటయిరైపోయాడులే. ఈ గవర్నమెంటు ఉద్యోగులున్నారే, వీళ్ళేం మనుషులోగానీ, ఎంతొచ్చినా తెగ తినేస్తారు. జీతం రాళ్ళు అందినంత కాలం పండగే. ఆ పైన ఎండగ. రిటయిరైనప్పుడు ఎంతో కొంత మొత్తం చేతికొస్తే, ఇద్దరు కూతుళ్ళ కెట్లాగో పెళ్ళి చేశాడు. కొడుకులైతే ఇద్దరో ముగ్గురో వున్నారటగానీ వాళ్ళ బతుకులూ అంతంత మాత్రం. వాళ్ళు తన కేమీ విదిలించే స్థితిలో లేరు. ఇంతలో ఈ పిల్ల ఒకతె పెళ్ళికి తయారైంది. ఉన్న ఇల్లు అమ్మేస్తే గానీ ఆ పని జరిగేటట్టు లేదు. అందు కీపిల్లే ఒప్పుకోడం లేదట! ముసలాడు నా దగ్గరికొచ్చి బాధపడితే పోనీ లెమ్మని ఉద్యోగం యిచ్చాను"

"ఎలాగైనా దయగల తల్లి! మనసులోనే అనుకున్నాడు పాండురంగం.

మీరాబాయితోబాటు భోజనానికి కూర్చున్న పాండురంగం డైనింగ్ టేబిల్ వైపు చూచి అదిరి పోయాడు.

"అయ్యో, ఏమిటిదంతా! ఇన్ని వంటకాలెందుకు చేయించావత్తయ్యా!" అంటూ నొచ్చుకున్నాడు. "నీకనే కాదులేరా! ఇవన్నీ మా మామూలు వంటకాలే, నువు తినగలిగినంత తిను. మిగిలినవి తీసి నరసమ్మ ఫ్రిజ్‌లో పెట్టేస్తుందిలే" అంటూ అనునయించింది మీరాబాయి. కానీ భోజనాలు ముగించేసరికి ప్లేట్లన్నీ యించుమించుగా ఖాళీ అయిపోయి వుండడం గమనించి, పాండురంగం ఆశ్చర్యపడిపోయాడు. మీరాబాయి భోజన పుష్టిని గురించి నాలుగు మంచి మాటలు చెప్పాలని గూడా ఆతడిలో ఒక చిలిపి కోరిక రొదపెట్టింది. కానీ ఉదయం నుంచి తాను పోషిస్తున్న కృతక పాత్రపట్ల అతనికప్పటికే అసహ్యం పుట్టిపోయింది. అందువల్ల మౌనంగా చేయి కడుక్కుని, అతిథులకోసం ఉద్దేశించిన గదిలోకి వెళ్ళి, మంచం పైన మేను వాల్చాడు.

గాఢంగా నిద్ర పట్టింది. మేలుకునేటప్పటికి హాల్లో నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"ఏమమ్మాయ్! పర్మిషన్ లెటర్ కూడా రాసి తెచ్చేశావా? ఇలాంటి దేదో చేస్తావని నాకు తెలుసులే! ఇదేమిటి? 'తొందరపని' అని రాస్తే సరిపోయిందా? అదేమిటో మేము తెలుసుకోగూడదా?"

"నిజంగానే మేడం! తప్పకుండా ఇంట్లో వుండి తీరాల్సిన పని"


"అట్లాగైతే అదేమిటో చెప్పొచ్చుగా! ఏమైనా దేవ రహస్యమా అమ్మాయ్!"

"అబ్బే రహస్యమేమీ కాదండీ!" చెప్పడానికి సిగ్గో, లజ్జో, బిడియమో, మరేదో ఆ అమ్మాయి గొంతుకకు అడ్డు తగులుతున్నట్టుంది. అయినా ప్రయత్నించింది "మరి...మరి నాకండీ...పెళ్ళి చూపులకని ఎవరో..."

"ఓహో, అలా చెప్పు. పెళ్ళి చూపుల కనివచ్చే వాళ్ళు ముహూర్తం పెట్టుకున్నట్టు 3 గంటలపైన 4 గంటలలోగానే వస్తారా? ఒకవేళ వచ్చారే అనుకో, కాసేపు వెయిట్ చెయ్యలేరా?"

సరిగ్గా ఆ సందర్భంలో అనుకోని సన్నివేశం ఒకటి

## కదిలీ కదలని చిత్రాలు



ఎగిరే చుక్కల్లా వున్నాయి ఈ మిణుగురులు
ఎగరలేని మిణుగురుల్లా వున్నాయి ఆ చుక్కలు
గతి తప్పి ప్రవహించే నదులు,
మతి తప్పి ఘోషించే సముద్రాలు,
ఋతువులు, ఋతు పవనాలు
వనాలు, వానలు
తడారిన ఎడారులు,
బండబారిన కొండలు,
ఒకటేమిటి?
యావత్ ప్రకృతీ- లయబద్ధం
ఈ విశాల విశ్వమూ - సీమాబద్ధం!

—బి. నిర్మల్ రావు

అక్కడ రూపుదాల్చింది.


"వెయిట్ చెయ్యవలసిన అవసరమేమీ లేదులే అత్తయ్యా! ఆ పెళ్ళి చూపుల తతంగం ఎప్పుడో ముగిసింది. ఇప్పుడీ అమ్మాయి ఆలస్యంగా వెళ్ళినా మించి పోయిందేమీ లేదు" మాట్లాడుతూ మాట్లాడుతూ హాల్లోకి వచ్చేశాడు పాండురంగం.

నోట మాట రాక నిలువు గుడ్లేసుకుని దిగ్భ్రమతో పాండురంగం వైపు చూస్తూ వుండిపోయింది మీరా బాయి. కొద్ది క్షణాల తర్వాత తెప్పరిల్లి "ఏమిట్రా నువ్వనేది?" అంటూ విస్మయం వెలిబుచ్చింది.

"అవునత్తయ్యా! ఆ పెళ్ళి చూపులకు వెళ్ళవలసిన వాణ్ణి నేనే!"

"ఓరి పిట్ట పిడుగా!" ఆగ్రహంతో ఉరిమింది మీరాబాయి.

"ఉండు అత్తయ్యా! సంగ్రహంగానైనా వివరాలు విను. ఈ అమ్మాయి పేరు నళిని. రామవరం తాలూకాఫీసులో గుమాస్తాగా వున్న రోజుల్లో వీళ్ళ నాన్న శివరామయ్యగారితో మా నాన్నగారికి కొంత పరిచయం కుదిరింది. ఈ మధ్య మా నాన్నగారు టౌనుకొచ్చినప్పుడు శివరామయ్యగారు బజార్లో కనిపించి, తన కడగొట్టు కూతురి కొక సంబంధం చూచిపెట్టమన్నారట. అమ్మాయి బి.ఎ. దాకా చదువుకుందనీ, ప్రస్తుతం ఇక్కడి బృందావన్ కాన్వెంటులో పనిచేస్తోందని గూడా అన్నారట. మా నాన్నగారు ఇంటికొచ్చి 'ఒకసారి ఆ అమ్మాయిని చూచి రాగూడదట్రా?' అని నాకో సూచన చేశారు.




'నీకు నచ్చితే మాకు నచ్చినట్టే'నని మా అమ్మ కూడా తేల్చి చెప్పేసింది. అందుపైన ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. అందుకు ఫలితంగానే నేనిలా రావడం! లేదంటే ఈ రోజు నేను కొంచెం ముందుగానే వచ్చేశాను. పెళ్ళి చూపులకు ఇంటికి బదులుగా కాన్వెంటునే వేదికగా ఎన్నుకున్నందుకు నువ్వు మన్నించాలి. అమ్మాయి నాకు నచ్చింది. ఇక నే నామెకు నచ్చానో లేదో తెలుసుకోవాలి. ఆమెకున్నూ అంగీకారమే అయితే, ఆ మీదట మా పెళ్ళికి లౌకికమైన అవరోధాలేవీ వుండవనే అనుకుంటున్నాను..."

మీరాబాయి ముఖం కోపంతో జేవురించింది. కళ్ళు నిప్పులైపోయాయి. "ఎంతకైనా తగుదువురా నువ్వు! ఈ ఉద్దేశ్యంతో వచ్చావని తెలిస్తే, నిన్ని యింటి గడప తొక్కనిచ్చేదాన్ని గాను..." అంటూ బుసలు కొట్టింది.

చిరు నవ్వులు చిందిస్తూ అడిగాడు పాండురంగం- "నన్నయితే అన్నావుగానీ, రేపు నీ కొడుకే యింటికొస్తే అంతమాట అనగలవా అత్తయ్యా!"

"నా కొడుకా! వాడు నీలాంటి బదుద్ధాయి కాదు..."

పకాలున నవ్వేశాడు పాండురంగం. "అవునవును. ఆ మాట మాత్రం నిజం. కులం, మతం, భాష, దేశం- యిలాంటి అడ్డుగోడలన్నీ అధిగమించి అమెరికా అమ్మాయిని పెళ్ళాడినవాడు బదుద్ధాయెందుకవుతాడు?"

"ఏమిటేమిటి? నిజంగా...? నిజమా? నా కొడుకు...అమెరికా అమ్మాయిని..." రొప్పుతూ, రోజుతూ ప్రశ్నించింది మీరాబాయి.

శాంతం, శాంతం- అన్నట్టుగా అభయహస్తం చూపించాడు పాండురంగం. " ఈ రోజు కాకపోతే రేపైనా నీకు తెలుస్తుందిలే అత్తయ్యా! కోప్పడకు. తమాయించుకో!"

ఆ మాత్రం హితబోధతో మీరాబాయిని వదిలిపెట్టి, బుల్లి పంతులమ్మ వైపు తిరిగాడు పాండురంగం.

"ఇక మనం వెళ్దామా నళినీ! మీ వాళ్ళు నీకోసం వేచి చూస్తుంటారు" అన్నాడు.




DEALERS IN:
UPTRON,
BPL-INDIA,
ECT, CROWN-
HONETECH TVS

DISTRIBUTORS FOR Zilog BOOSTERS

డీలర్స్: దివ్వెల పెయింట్స్ & కంపెనీ
భవాని థియేటర్ వద్ద - చీరాల